క్లుప్తంగా

వేణుపాల స్వామి ఆలయంలో ధ్వజ కళా వాహనం



మొవ్వ: మహాకవి క్షేత్రయ్య ఆరాధ్య దైవమైన మొవ్వ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ధ్వజ కళా వాహనం కార్యక్రమాన్ని వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వేదపండితులు వేదాంతం హరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొవ్వ గ్రామానికి చెందిన మండవ దినాకర్, లక్ష్మీ దంపతులు స్వామి వారి శాంతి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు సీతారామ హనుమాన్, వంశీ మోహన్ ఈ కార్యక్రమాలకు సహకరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి సలాది వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

పేదలకు ఆహారపు పొట్లాల పంపిణీ



పామర్రు: పేదలకు ఒక్కపూట ఆకలి తీర్చితే అది దైవానికి తీర్చినట్లే అని భావించి ఆదివారం పలువురు పేదలకు ఆహారపు పొట్లాలను అందజేశారు. తాడి శెట్టి మిత్ర బృందం సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తాడిశెట్టి సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మిత్ర బృందం సభ్యుల ఆధ్వర్యంలో పేదలైన 105 మందికి ఆహారపు పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓంకార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ అధినేత తాడిశెట్టి నాగబాబు, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



పామర్రు: గ్రామానికి చెందిన రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాతృమూర్తి బొమ్మారెడ్డి వీర రాఘవమ్మ దశ దిన కర్మ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కంచర్లవానిపురానికి చెందిన తలారి చంద్రమోహన్ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఓటు వేసి అభివృద్ధికి తోడ్పడండి

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించడం వలన రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆదివారం పట్టణంలోని 16, 17 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అదే చంద్రబాబుకు ఓటు వేస్తే రాష్ట్రం పదేళ్లు వెనక్కు వెళుతుందన్నారు. మోసం, దగా, కుట్రలు బాబు సొంతం అయితే పేదల అభివృద్ధి, ఉత్తమ విద్య, వైద్యం, పేదల సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అని పేర్కొన్నారు.

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పేదలకు రూ. 3 వేలు పెన్షన్ అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఏడాదికి రూ.24 వేల కోట్లు పెన్షన్ల ద్వారా ప్రజలకు అందజేస్తున్నారన్నారు. పేదల పక్షాన నిలబడే వ్యక్తి ముఖ్యమంత్రి కావాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ గుడే లక్ష్మీ రంగనాయకమ్మ, వైఎస్సార్



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, నాయకులు పాలేటి చంటి, కె.కుమార్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, చింతల భాస్కరరావు, జోగా సూర్యప్రకాశరావు, అల్లం సూర్యప్రభ, జ్యోతుల సత్యవేణి, సర్దార్‌బేగ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, ఉపాధ్యక్షుడు అలీబేగ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు, రేమల్లి నీలాకాంత్, వెంపటి సైమన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానికి హారతి ఇస్తున్న మహిళలు

ఏసుక్రీస్తు జీవితం ఆదర్శప్రాయం



దానగూడెంలో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్



రిమ్మనపూడిలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గుడివాడలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కైకలూరు: ఏసుక్రీస్తు జీవితం సర్వమానవాళికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఈస్టర్ సందర్భంగా స్థానిక దానగూడెం ఐసీఎం, అపోస్థలిక్ బైబిల్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రఫీ, పాస్టర్ విక్టర్ పాల్, బిరుదుగడ్డ లాజర్, ఇంటి రాజు, పెయ్యేద్దు దుర్గారావు, మద్దా రాము, ఇంటి లాజరు, బిరుదుగడ్డ క్రీస్తు రాజు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతే ధ్యేయం

పామర్రు: క్రైస్తవుల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని రిమ్మనపూడి గ్రామంలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం పలువురు పాస్టర్లు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవులు ఈస్టర్‌ను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పెదపారుపూడి రక్షణ సైన్యం చర్చిలో మేజర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మేజర్ లోర్ది కుమారి, సంఘ పెద్దలు దగాని జోసఫ్, నత్తభూషణ్ కుమార్, గూడపాటి భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్

తోట్లవల్లూరు: ఈస్టర్ పర్వదిన వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్ వేడుకలతో ప్రార్థన మందిరాలు సందడిగా మారాయి. తోట్ల వల్లూరు దైవస్వరూపి చర్చిలో పాస్టర్ వల్లూరు సలోమన్‌రాజు దైవసందేశం వినిపించారు.

పామర్రులో..

పామర్రు: మండలంలోని అన్ని చర్చిలలో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెదమద్దాలిలోని సెయింట్ పాల్ చర్చిలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్ మాట్లాడుతూ జీవం కల్గిన దేవుడు ఏసు క్రీస్తు అన్నారు. మన పాపాలను ప్రక్షాళన చేసేందుకు ఏసు క్రీస్తు మళ్లీ జన్మించారని అన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సమ్మంగి సత్యరూతు, కాకే ప్రసాద్, దోమతోటి గ్రేసమ్మ, గుమ్మడి నవ్య, కొకొళ్ల రాజ్యలక్ష్మీ, పెట్టం నాంచారయ్య, సోలే కృపమ్మ, కంచర్ల షారోన్ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ఏసుక్రీస్తు సిలువ మరణం అనంతరం మూడో రోజు సమాధి నుంచి సజీవునిగా తిరిగి లేచిన సందర్భాన్ని స్మరించుకుంటూ క్రైస్తవులు క్రీస్తు పునరుత్థాన(ఈస్టర్) పండగను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.



తోట్లవల్లూరులో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సలోమన్‌రాజు



పెదమద్దాలిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ కృష్ణపాల్

వేకువజామునే ఆలయాలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పలు ప్రార్థనా మందిరాల్లో నిర్వహించిన ప్రార్థనలో పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం నిడుమోలు శివారులో జరుగుతున్న పేకాట శిబిరంపై కూచిపూడి ఎస్ఐ టీ శ్రీనివాస్ ఆదివారం తమ సిబ్బందితో దాడి చేశారు. ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.12,480ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు



ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కలిదిండి: గత ఐదేళ్లలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించి ప్రజలకు మేలు చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి పరిధిలోని 8వ వార్డులో ఆదివారం 6వరోజు గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమం కొనసాగింది. ఎమ్మెల్యే డీఎన్నార్ నాయకులతో కలసి ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో సాధ్యం కాని విధంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. పేదల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా పాలన సాగిస్తుంటే ప్రతిపక్ష నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, ఎంపీటీసీ షఫాయితుల్లా, నీలి సుమన్, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు

కలిదిండి: గంగానమ్మ తల్లి అమ్మవారి చల్లని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆశించారు. సానరుద్రవరంలో గంగానమ్మ తల్లి జాతరలో ఎమ్మెల్యే డీఎన్నార్ ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

కైకలూరు: ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను గెలిపించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి దూలం వీరకుమారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఆచవరం శివారు వింజరంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఆదివారం ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ, శ్యామలాంబపురం, గోపవరం సర్పంచ్‌లు సంకు కోటేశ్వరరావు, ఉలిసి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలి

కలిదిండి: జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలంటే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పెద్ద కోడలు శ్రీఅనుపమ కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఎస్ఆర్‌పీ అగ్రహారం గ్రామంలో నాయకులతో కలిసి ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డీఎన్నార్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టసుఖాల్లో ప్రజలకు డీఎన్నార్ తోడుగా నిలిచారని, కరోనా సమయంలో నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్‌లు మసీముక్కు మారుతి ప్రసన్న, ద్రోణాద్రి నాగలక్ష్మి, నాయకులు కట్టా లక్ష్మణ్, పండు, ముసలయ్య స్వామి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

కన్యకాపరమేశ్వరి ఆలయం ముస్తాబు

పెడన: పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నిర్మించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో త్రయాహ్నిక మహాకుంభాభిషేకాల మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 3, 4, 5వ తేదీలలో జరిగే ఈ మహోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవ క్షేత్రమైన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానాన్ని ముస్తాబు చేస్తున్నారు. 1974 మార్చిలో వాసవి క్షేత్రం ప్రతిష్ట జరిగింది. ఆర్యవైశ్య సంఘ పెద్దలు కొల్లిపర వెంకట పూర్ణచంద్రరావు, జూపూడి పూర్ణ పుల్లారావు, మామిడి నరసింహారావు తదితరులు శ్రీ వాసవి క్షేత్రం స్థలం కొనుగోలుకు కీలక పాత్ర పోషించారు. వాసవి క్షేత్రం నిర్మాణానికి ఆర్యవైశ్య సంఘ పెద్దలు తమ్మన గంగయ్య, కొల్లూరి శ్రీనివాసరావు, చిట్టూరి మాధవరావు, జవాజి బ్రహ్మ శాస్త్రి, జల్లూరి సూర్య ప్రకాశ్రావు, జల్లూరి మాధవరావు, కొల్లూరి రామచంద్రరావు, తదితర పెద్దల నేతృత్వంలో శ్రీ వాసవి అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు శ్రీమహాగణపతి, నవగ్రహాలు, శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, శ్రీ పద్మావతి అలివేలు మంగ వెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి ఆలయం, శ్రీ మహిషాసుర మర్దని, శ్రీ బాలా త్రిపుర సుందరి ఉపాలయాలు నిర్మించారు. ప్రతి సంవత్సరం దసరా నవరాత్రులు, వాసవి అమ్మవారి జయంతి, శ్రీ మహాగణపతి ఆలయంలో వినాయక చవితి పండుగ నిర్వహిస్తూ వస్తున్నారు. కార్తికమాసంలో కాశీ విశ్వేశ్వర స్వామి



విద్యుత్ దీపాలంకరణలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం

వారికి ప్రత్యేక పూజలు, శ్రీ అయ్యప్ప స్వామి వారికి మండల పూజల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు పడిపూజ కార్యక్రమం ఆరు శనివారాలు అయ్యప్ప స్వాములకు, శివ స్వాములకు, భవానీలకు సద్ది నిర్వహిస్తూ వస్తున్నారు. ధనుర్మాసంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు భోగం పూజా కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను, శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తామని డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) తెలిపారు. స్వర్ణోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీవాసవి క్షేత్రంలో ఏప్రిల్ 3, 4, 5వ తేదీలలో నిర్వహించే సంపూర్ణ మహాకుంభాభిషేకం పూజా కార్యక్రమానికి సంబంధించి ఆలయాన్ని ఆలయాన్ని నూతన రంగులతోను, విద్యుత్ దీపాలతో అలంకరణ, చలువ పందిళ్లతో ముస్తాబు చేస్తున్నారు.

పేదలకు వరం.. ఉపాధి హామీ పథకం

- గతేడాది 3.92 లక్షల పనిదినాలు
- నేటి నుంచి ఉపాధి పనులు ప్రారంభం

పమిడిముక్కల: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదలకు వరంగా మారింది. పనుల్లేక కూలీలు వలసలు వెళ్లకుండా ఉండేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రతి కుటుంబానికీ 100 రోజులు పనిదినాలు కల్పించాలనేది ఈ పథకం ఉద్దేశం. ఈ నెల ఒకటో తేదీని ఉపాధి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు పని కల్పించ నున్నారు. వేసవిలో పనులు లేని సమయంలో ఉపాధి పనులు చేసుకుని కూలీలు జీవనం సాగిస్తున్నారు. రోజువారీ వేతనాన్ని రూ.272 నుంచి రూ.300కు పెంచారు.

18,128 మందికి జాబ్‌కార్డులు

మండలంలోని 25 గ్రామాల్లో 18,128 మందికి జాబ్ కార్డులు మంజూరు చేశారు. 2024-25లో 3.83 లక్షల పనదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గత ఐదేళ్లలో...

2019-20 సంవత్సరంలో 2.10 లక్షల పనిదినాలు కల్పించి రూ.4.36 కోట్లు వేతనాలు చెల్లించారు. 2020-21లో 2.68 లక్షల పనిదినాలు కల్పించి రూ.6.06 కోట్ల వేతనాలు, 2021-22లో 3.28 లక్షల పనిదినాలు కల్పించి రూ.7.40 కోట్లు, 2022-23లో 3.60 లక్షల పనిదినాలు కల్పించి రూ.8.23 కోట్లు, 2023-24లో 3.92 లక్షల పనిదినాలు కల్పించి రూ.9.88 కోట్లు వేతనాలుగా చెల్లించారు.



శ్రీరంగపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధి పనులు ప్రారంభం

ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మండంలోని అన్ని గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఉపాధి పనులు ప్రారంభమవుతాయి. పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇచ్చి 100 రోజుల పనిదినాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పంట బోదెలు, చెరువులు తవ్వకం పనులు ఎక్కువగా జరుగుతున్నాయి.

– కిరణ్‌కుమార్, ఏపీఓ

వేసవిలో ఉపాధి

పనుల్లేని వేసవి సీజన్‌లో ఉపాధి పథకం ఆదుకుంటుంది. ఈ పథకం కూలీలకు వరం లాంటిది.


ఈ పథకానికి మరింత నిధులు కేటాయించి పెద్ద మొత్తంలో పనులు కల్పించాలి. వేతనాన్ని పెంచాలి.

– బొల్లా మల్లేశ్వరి, ఉపాధి కూలీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తోట్లవల్లూరు: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామంలోని రైస్‌మిల్ బజారుకు చెందిన తోట శ్రీనివాసరావు(60) గత నెల 29న పురుగుల మందు తాగడంతో అతడి కుటుంబసభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

కైకలూరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కై కలూరు రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్ కోరారు. పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, ఆలపాడు పల్లివాడ గ్రామాల్లో కేంద్ర సాయుధ దళాలు, పోలీసులతో కలసి కవాతు నిర్వహించారు. అనంతరం ఆలపాడు సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో అధిక మొత్తంలో నగదు తరలిస్తే సంబంధిత పత్రాలు చూపించాలన్నారు. రూరల్ ఎస్సై టి.రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఆలపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ కృష్ణకుమార్